స్కెచ్

# వీళ్ళు న్యూసెన్సు చేస్తున్నారు

—పి. యస్. వర్మ

అబ్రహాం లింకను బహుచెడ్డ మానవతావాది. అతనికి న్యూసెన్సంటే బహుచెడ్డ తలనొప్పి ఒక రోజున లింకను వో గుఱ్ఱబ్బగ్గిలో ప్రయాణం చేస్తోందగా రెండు పట్నాల మధ్య వో నిర్జన ప్రదేశంలో రోడ్డు పక్కగా బురదగుంటలో వో పంది పిల్ల (సీమపంది అనుకోవచ్చు క్లాసికల్ పాఠక మహాశయులు) చిక్కుకునిపోయి, విపరీతంగా 'గీ' పెడుతోందట. లింకను హృదయం పగిలిపోతోంది ఆ గోలను వింటున్న కొద్దీ అలానే మనసులో భయం పీకుతోంది – కొంపతీసి ఇంతటి వాడూ ఏదో మనముందు గొప్పను పులుము కోవడం కోసం ఈ పని చేశాడని మిగతా బగ్గీలో ప్రయాణీకులనుకుంటారేమోనని కాని హృదయ విదారకమైన ఎదురుగా పంది గోల. ఇంక ఏమయితే అయిందనుకుని లింకను గుర్రబ్బగ్గీని ఫర్లాంగు దూరం దాటి వచ్చేసిన తర్వాత కూడా ఆపి, పంది పిల్ల దగ్గరకు తన 'కలోసస్' కాళ్ళతో గెంతుకెళ్ళి ఎంచక్కా పందిపిల్లను బయటకులాగి, తేటనీటిలో కడిగి రోడ్డుమీద వదిలి వచ్చేడుట. మరి మిగతా వాళ్ళు వూరుకున్నారా! ఏమయ్యా ఇటువంటి అర్జంటు ప్రయాణాల్లో సాధారణంగా ఏదో పీక మీదకు ముంచుకొస్తేగాని బండి దిగం గదా. నువ్వు ఇప్పుడు చేసిన పని డాబు కొట్టుకోవడానికి కాదా–అని అడిగేశారుట. లింకను వోనవ్వు నవ్వేడుట. బాధా మిళితమైన మొహమాటపు నవ్వు. ఒకవేళ నేనే కనీసం ఫర్లాంగయినా దాటి వచ్చిన తర్వాత ఇప్పుడయినా పరిగెత్తుకెళ్ళి తీసివుండకపోతే ఆ గోలతో నా మతంతా రాత్రంతా గగ్గోలుపడి, నాకు కలలో ఆ పందిపిల్ల కన్పించి నన్ను శాంతిలేకుండా చేసేది. అప్పుడైనా వో ఇరవై మైళ్ళు పరిగెత్తో లేక గుర్రబ్బగ్గీ కట్టించుకునో వెనక్కొచ్చి తియ్యాల్సిన పనేగదా. పోనీ మీ వంటి సహృదయులు వో నలుగురు అపార్థం చేసుకుంటే పాయె, అంతేగాని బోలెడంత సమయమూ ఇరవై మైళ్ళ పరిగెత్తడమూ మొదలైన శ్రమలెందుకని ఈ మాత్రం సాహసం చేసేశాను – అని చెప్పేసి, తప్పొప్పుకున్నట్టు మౌనంగా కూర్చుండి పోయాడుట ఆ చప్పిదవళ్ళ గొప్ప మనిషి.

పంది పిల్ల దాని బ్రతుకోసం అది 'గీ' పెడుతోంది గనుక ఆగోల న్యూసెన్సు అవదు. కాని అపరిణిత మనస్సుల వాళ్ళ అజ్ఞానంతో అవతలి వాళ్ళకు కలిగిస్తున్న ఇబ్బందిని తెలుసుకోకుండా చేస్తున్న గోలను మనం న్యూసెన్సు అంటాం. మానసికంగా సరిగా ఎదగని మనుష్యులే న్యూసెన్సు చేసే వాళ్ళు. తమ స్వార్థం తప్పితే వాళ్ళకు అవతలి వ్యక్తులకు జరిగే హాని తెలియదు. తమ సరదాకు రాత్రంతా మైకుపెట్టి సిన్మా పాటలు వేద్దామనుకునే వాళ్ళు. ప్రపంచం నిద్రావస్థలో వున్నదన్న నిజాన్ని గమనిస్తున్నారా! ఒకవేళ ఇల్లు గలవాళ్ళు అక్రమంగా అద్దె పెంచాలనుకుంటారు. అందుకు ఉన్నవాళ్ళను లేవగొట్టి కొత్తవాళ్ళనుంచి ఎక్కువ సొమ్మును రాబట్టుకోవాలనే యోచన. అలా లేవగొట్టేందుకు చేసే ప్రయత్నాల్లో డబ్బాలు వాయించడం, సణగడం, పిల్లిమీదో ఎలక మీదోపెట్టి చివరకు తిట్లూ – ఇవన్నీ చేస్తూపోవాలి. చివరికి పడలేక ఇంట్లోవున్న వాళ్ళు పారిపోవాలి. ఇది న్యూసెన్సు కాదూ! ప్రక్కవాటా బాగుంది కదా, వీళ్ళ మీది అభిమానంతో ఆ మంచి మనుష్యులు (మనకు ఆ బాగున్న వాటా ఇవ్వలేదు గనుక వాళ్ళంటే మనకు తగని కసి) ఆ వాటాను వీళ్ళకెందుకివ్వాలి. ఎలానోలాగు మన మానవ ప్రయత్నం మనంచేసి వీళ్ళను అల్లరి పెట్టి, గంగవెర్రు లెత్తి ఇల్లువదిలి పోయేలా చేయాలని రకరకాల అసభ్య గోలలతో రాత్రింబవళ్ళు ఇదే ఆలోచనతో శ్రమపడితే అది మహాగొప్ప న్యూసెన్సు అవుతుంది.

మా స్నేహితుడు రామేశం అని వున్నాడు. వాడు ఈ న్యూసెన్సును ఎంత భరించలేక పోయాడంటే, వాళ్ళ పక్కింట్లో పిల్ల వుద్యోగం వూడి ఏమీతోచక (తిరిగే కాలూ తిట్టేనోరు వూరికే వుండలేవుగదా!) పికపికలూ పకపకలూ, రోజూ వో నాటకాన్ని ప్రదర్శిస్తోంటే – ఒక పని చేశాడు ఆ పిల్ల ఉద్యోగానికి అప్లయి చేసినచోటో లేక ఇంటర్వ్యూ వచ్చిన చోటో తెలుసుకుని, ఆ రోజు తన ఆఫీసుకు శెలవు పెట్టుకుని ఆ స్నేహితుడివల్ల ఇంకో స్నేహితుడికి అతనివల్ల మరోడికి ఆ రకంగా సిఫార్సులు చేయించి పరోక్షంగా ఆ పిల్లకు ఉద్యోగ ప్రయత్నం చేస్తూండేవాడు. అప్పటికీ ఏ పెద్ద రికమండేషనోవచ్చి ఆ వుద్యోగాన్ని వూడ్చుకు పోయేది. (అది వాడి దురదృష్టం). ఇంతకీ అతగాడు అనేదేమిటీ—పోనీ రాత్రులూ పగలూ రేడియో పెట్టుకోనీ మా చెవులు వినలేనంతగా – పోయిందేమీలేదు ఇవ్వాళ సెక్సు సాహిత్యం బజార్లో బాగా అమ్ముడు పోతోంది. సినిమాలూ పోస్టర్లే చూసి భరించలేక బాధ పడుతోంటే మళ్ళీ ఇదోపక్క ఎడతెరిపి లేని డైలాగులూ పాటలూ వినలేక పోతున్నానుగదా భగవంతుడా!" అని అఘోరిస్తాడా అమాయకుడు. అతను నా స్నేహితుడు రామేశం.

ఇంక ఈ మధ్య మరో వినదగ్గ గొడవ దారేపోతూ అలా రఘుపతి ఇంటికివెళ్ళా. రఘుపతిమానసికవైద్యుడు(Psychiatrist) వెళ్ళగానే మొదలు పెట్టాడు. మొన్న శ్రీనివాసులు వచ్చాడురోయ్ – అన్నాడు. అసలు సంగతేమంటే శ్రీనివాసులు అద్దె ఇంట్లో వుంటున్నాడు. అతని పక్కవాటాలో ఒక Pseudo-Civilization రకం మనుష్యులు వున్నారట. ప్రతిరోజూ సాయంత్రం నువ్వు ఈ అయిదు పైసలూ వాడికి ఎందుకిచ్చావూ లేక చింతపండు మీద వృధా చేశావూ అంటూ మొదలుపెట్టి చాకిరేవులో బాగా మాసిన గుడ్డను తిట్లు తిన్న పంతం చాకలి వుతికినట్టు మొగుణ్ణి వుతికేస్తూంటుందట ఆ పెళ్ళాం మహాతల్లి. పోనీ ఆ రెండు పైసలో అయిదు పైసలో

నేవిస్తానుగాని. చుట్టుపక్కల పొరుగువాళ్ళు మనే వాళ్ళంమేమంతావుండి ఈ కేకలు వినలేక ఛస్తున్నాం — అని చెప్పేందుకు చొక్కా వేసుకుని వెళ్ళబోయిన వాడల్లా వూరుకుని. శ్రీనివాసులు సరాసరి ఎంచక్కా బయల్దేరివచ్చి రఘుపతితో వెళ్ళబోసుకున్నాట్ట—ఏం చేయమంటావు ఈ విషయంలో అని. ఆడగొంతు ఎంత చెడ్డా వినడానికి సొంపుగానే వుంటుంది గదుట్రా. ఏదో మనకెందుకులే అని సర్దుకుపోతే పోలా— అని సలహా ఇచ్చేడుట రఘుపతి.

"లేదయ్యా తండ్రీ. అలా వుతికి వుతికి వదుల్తూంటుందా. నామగతనానికే పెద్దదెబ్బలాగా భావిస్తూంటాను — తోటి మగాణ్ణి అలా రోజూ సాయంత్రం పవిగట్టుక సతాయిస్తోంటే" అన్నాడు శ్రీనివాసులు.

"పిల్లలున్నారా?" అని అడిగేడు రఘుపతి. ది సైకియాట్రిస్టు.

"లేరు" అన్నాడు శ్రీనివాసులు.

ఒక చిరునవ్వు నవ్వేడు సైకియాట్రిస్టు. ఒక్కసారి సిగిరెట్టు పొగపీల్చేడు. ఒక దగ్గు దగ్గి సర్దుకూర్చున్నాడు

"చూడు మైడియర్ సీనూ, ఈ కేసు వ్యవహారం నువ్వు చెప్పకుండా నేనే సర్వం చెబుతాను విను. ఎప్పుడైనా హావలాక్ ఎల్లిస్‌ను చదివావా? (లేదన్నట్టు శ్రీనివాసులు తలను తిప్పేడు) ఆ పిల్లకు మగడి మీద అతగాడు తనకుపిల్లల్నికలగజేయలేక పోతున్నాడన్న బాధవుంది. అది ఇంకెలానూ తీర్చుకోలేక ఈవిధంగా సతాయించి దిగజార్చి, ఈ సంఘపు పడికట్లలో పడి ఇంకేమీ చేయలేక బ్రతుకును ఆషోకుమీదో ఈ వ్యాపకం మీదికో మళ్ళించుకుని జీవితాన్ని నింపుకుంటోంది......" రఘుపతి ఒక్కక్షణం ఆలోచిస్తూ ఆగి, శ్రీనివాసులు వైపువంగి, "…. ఇకొకటి. ఆ పిల్ల మొగుడు ఆ పిల్లతో ఎంతో బాగా సర్దుకుపోతూండాలి. ఎందుకంటే అతడిలో ఒక మానసిక వ్యధ ఈ సరికే రేగివుంటుంది. వ్యాధి పీడితుడికి ఆరోగ్య ప్రపంచం మీద ఉన్నంత కసి వుంటుంది — చుట్టూవున్న కళకళలాడే కుటుంబాలమీద అతని మనస్సులో. కాని తన అసమర్థత (Impotency) ను కప్పిపుచ్చుకుంటూ ఎంతో బాగా సమాజంలో ఇదంతా బయటపడకుండా వుండగలందులకు అనేక రకాలుగా సర్దుకుపోతూంటాడు. అయితే అలా అణగదొక్కబడుతున్న అహాన్ని (Ego) ఏ విధంగానూ కోలుకోలేక అతడిలో ఒక పైశాచిక ప్రవృత్తి (Sadism) కూడా చోటు చేసుకోవడానికి ఆస్కారంవుంది. అప్పుడు వ్యక్తిలో కొన్ని నార్మల్ ప్రవృత్తులు మరుగున పడిపోతాయి. ఎలానోలాను ఇతరుల్ని అల్లరిపెట్టడమూ. తన ప్రపంచంలో తను బ్రతుకుతూ సభ్యా సభ్యతల్ని అర్థం చేసుకోలేక పోవడమూ కలుగుతాయి ఇలా ఒకరకం అపక్రమ (Perverted) మార్గానికి దాసోహమవుతూ దిగజారిపోతున్నవ్యక్తి చుట్టూ ప్రపంచం చేత చివరికికొక అవాంఛనీయ వ్యక్తిగా జమ కట్టబోయే ప్రమాదమూ లేక పోలేదు... నేనూ ఒక మగవాణ్ణే అని మిగతా వాళ్ళు అనుకోవాలనే తహతహతో అరవడమూ ప్రవర్తించడమూ చేస్తూంటాడు కదూ?" అని ప్రశ్నించేడు రఘుపతి.

ఇదంతా నీవు ఎలా గ్రహించగలిగేవు అన్నట్టుచూసి తల వూపేడు శ్రీనివాసులు.

"….అక్కడే వుంది గమ్మత్తు, ఇంక కొన్నాళ్ళుపోతే ఆ పిల్ల అతణ్ణి నువ్వు వినలేనంతగా దులపదు. రాజీకొస్తుంది. పైగా ఇద్దరూ కలసి కావాలని మిమ్మల్ని విసిగించే ప్రమాద పోకడలున్నాయి నువ్వు మరీ సున్నితుడివి (Sensitive). పడలేవేమో కూడా. వాళ్ళిద్దరి మధ్యావున్న సాంసారిక శూన్యతను నింపుకోవడానికి వాళ్ళు ప్రపంచాన్ని పరిహసించాలి. అందుకు ప్రాతినిధ్యంగా పరిపూర్ణ సంసారులుగానూ, అదే వయస్సులో మీరూ వుండడం వల్లా మీరు వాళ్ళలో మీతప్పు లేకుండా అసూయ రగుల్కొల్పడానికి బాధ్యులవుతారు. మీకన్నా మేం బాగా బ్రతుకుతున్నాం అని చాటి చెప్పుకోవడానికీ. అరకంగా తమ అసంపూర్తి దాంపత్యాన్ని కప్పిపుచ్చుకోవడానికీ, అర్రులుచాచి మిమ్మల్ని వాళ్ళు బోరు కొట్టేస్తారు…"

"మరినాకు ఈ న్యూసెన్సు నుంచి విముక్తి స్వామీ?" అని ప్రశ్నించేడు సీను.

"ప్రతిరోజూ పొద్దుటే లేచి ఏదో వో ఇష్టదైవాన్ని ఎన్నుకుని వాళ్ళింట్లో ఎలానోలాను వో పాపాయి పుట్టాలని కోరు. ఇంతగా వైద్యం అభివృద్ధి చెందింది. తప్పకుండా పుడతారు. ఆ విధంగా కొన్నాళ్ళలో నీకు ఈ విపరీతమైన ఇంతవరకూ రెండు గంటలుగా చెపుతున్న న్యూసెన్సు తగ్గాలిగాని, ఇంక ఇది అనితర అసాధ్యం" అని తేల్చి చెప్పేడుట రఘుపతి — ది సైకియాట్రిస్టు.

"అంతేనా?" అని టిక్కముఖం పెట్టేడుట సీను.

"అంతకీ నీకు ఏదయినా సలహా కావాలంటే—ఇల్లుమారు" అన్నాడు రఘుపతి.

"ఇంటి వాళ్ళూ, ఇంటి అజమాయిషీ చూస్తున్నవాళ్ళూ చాలమంచివాళ్ళు నాయనా ఈ నగరంలో ఇంత చక్కటి ఇల్లు దొరికేది లేదు అందుచేత ఆఇల్లు ఒక పట్టాన వదిలేది లేదు" అన్నాడు శ్రీనివాసులు.

"అయితే ఈ నాలుగు మాత్రలూ తీసికెళ్ళు. మిమ్మల్ని గురించి పరోక్షంగా ఏమాత్రమో సొల్లు చిమ్ముతున్నారన్నావే. అది వినగానే ఒక మాత్ర మింగెయ్యి. ఇంకొస్త సహనం కలుగుతుంది" అన్నాడట రఘుపతి

—ఇదంతా చెప్పి రఘుపతి — ది సైకియాట్రిస్టు నవ్వలేక నవ్వలేక రెండు నిమిషాలు నవ్వేడు.

న్యూసెన్సు అనేది చాల సామాన్య విషయం. ప్రతిచోటావుంటుంది ఈ న్యూసెన్సు. కాని కొన్ని కొన్ని న్యూసెన్సుల్ని భరించడం. అదయినా మానసికంగా దెబ్బతిన్న వాళ్ళ (Mentally Disturbed) న్యూసెన్సుల్ని అయితే — చాల యాతన.

పాపం అబ్రహాము లింకను! కాదు, పాపం పందిపిల్ల! పోనీ, పాపం అబ్రహాం లింకను. ★

---

ముఖచిత్రము :

పంతాలు పట్టింపులో ఒక సన్నివేశం